ఈనాడు హైదరాబాద్ బుధవారం డిసెంబరు 25, 2013

# హృదయం ఇక్కడున్నది!

- 12 కి.మీ. దూరం నుంచి 8 నిమిషాల్లో దాత గుండె తరలింపు
- యశోద ఆసుపత్రిలో 2 గంటల్లోపు గుండె మార్పిడి శస్త్ర చికిత్స
- బ్రెయిన్‌డెడ్ వ్యక్తి బంధువుల దాతృత్వం
- తరలింపులో పోలీసుల సహకారం
- జీవన్‌దాన్ తోడ్పాటు

ఈనాడు - హైదరాబాద్

ప్రాణదానానికి అచ్చమైన ఉదాహరణ ఈ ఘటన. రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి గుండెను... ఆగమేఘాల మీద మరో మనిషికి అమర్చిన ఘనమైన సంఘటన. దాతల దాతృత్వం, ట్రాఫిక్‌పోలీసుల సహకారం, జీవన్‌దాన్ పథకం పుణ్యం, వైద్యుల నైపుణ్యం... ఓ పాతికేళ్ల మహిళకు కొత్త ఊపిరి పోశాయి. నిత్యం ట్రాఫిక్ రద్దీ ఉండే రాజధాని నగరంలో 12 కిలోమీటర్ల దూరం నుంచి 8 నిమిషాల్లో దాత గుండెను ఆసుపత్రికి తీసుకొచ్చి రోగికి విజయవంతంగా అమర్చారు. అదీ కేవలం రెండు గంటల్లోపే. అవయవదానం ఔన్నత్యాన్ని, వైద్యుల విశేష కృషిని చాటే ఈ ఘటనకు సికింద్రాబాద్‌లోని యశోదా ఆసుపత్రి వేదికయ్యింది.

తూర్పుగోదావరి జిల్లా పిఠాపురానికి చెందిన వెంకట రమ్య(25)కు గర్భవతిగా ఉన్నప్పుడు అరుదైన 'పోస్టుపార్టమ్ కార్డియోమయోపతి' అనే సమస్య వచ్చింది. దీంతో ఆమె గుండె పనిచేయడం మందగించింది. గత ఏడేళ్లుగా చికిత్స తీసుకుంటున్నా ఫలితం లేకపోవడంతో కాకినాడలోని గుండె వైద్యనిపుణులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు పంపించారు. ఇక్కడ యశోద ఆసుపత్రి వైద్యులు ఆమెను పరీక్షించగా ఆమెకు గుండె మార్పిడి తప్పనిసరని తేలింది. 'జీవన్‌దాన్' పథకం కింద ఆమె పేరు నమోదుచేయగా, ఈ నెల 15వ తేదీన రోడ్డుప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ అయిన దాత నుంచి గుండెమార్పిడికి అవకాశం లభించింది. దాత నుంచి గుండెను తీసిన నాలుగు గంటల్లోగా అవయవమార్పిడి చేస్తేనే శస్త్రచికిత్స విజయావకాశాలు ఎక్కువ ఉంటాయి. ఈ కేసులో దాత నుంచి సేకరించిన గుండెను ప్రత్యేక ద్రావణంలో ఉంచి, రవాణాలో ఎలాంటి ఆలస్యం జరగకుండా పోలీసుల సహకరించారు. దీంతో 12 కిలోమీటర్ల దూరంలోని ఆసుపత్రి నుంచి 8 నిమిషాల్లో యశోదకు తీసుకువచ్చి, కేవలం రెండు గంటల్లోపు శస్త్రచికిత్స చేసి రోగికి అమర్చారు. వీలైనంత త్వరగా మార్పిడి చికిత్స చేయడం వల్ల ఏడు రోజుల్లోనే రోగి పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా యశోదగ్రూపు ఆసుపత్రుల ఎండీ డాక్టర్ జి.ఎస్.రావు, ఆస్పత్రి హృద్రోగ చికిత్సానిపుణులు డాక్టర్ ఎ.గోపాలకృష్ణ గోఖలేలు మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 'జీవన్‌దాన్' పథకం వచ్చిన తరవాత ఎక్కువ మందికి అవయవమార్పిడి చేయడానికి అవకాశం కలుగుతోందని డాక్టర్ జి.ఎస్.రావు చెప్పారు. సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే ఆధ్వర్యంలోని 15 మంది వైద్యుల బృందం చేసిన గుండెమార్పిడి శస్త్రచికిత్స విజయవంతమైందన్నారు. దీంతో తమ ఆస్పత్రిలో కీలకమైన ఊపిరితిత్తులు, గుండెమార్పిడి చికిత్సలను విజయవంతంగా చేసిన ఘనత సాధించామన్నారు. జీవన్‌దాన్ పథకం కింద మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తులు, కాలేయమార్పిడి చికిత్సలు సులభతరం అయ్యాయన్నారు. అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెంచితే, ఇంకా ఎక్కువ మందికి ప్రాణదానం చేయవచ్చని చెప్పారు.



గుండెమార్పిడి శస్త్రచికిత్స చేసిన డాక్టర్ గోఖలే బృందంతో యశోద గ్రూప్ ఆసుపత్రుల ఎండీ డాక్టర్ జి.ఎస్.రావు. వృత్తంలో చికిత్సపొందిన వెంకట రమ్య

మన దేశంలో దాదాపు 70 లక్షల మంది వివిధ రకాల గుండెజబ్బులతో బాధపడుతున్నారని, ఇందులో దాదాపు 60వేల మందికి గుండెమార్పిడి చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని డాక్టర్ గోఖలే 'ఈనాడు'తో చెప్పారు. చాలా మందికి ఈ చికిత్సలు చేయించుకోవచ్చుననే విషయంపై అవగాహన లేకపోవడం వల్ల వారు చికిత్స కోసం ప్రయత్నాలు చేయడంలేదన్నారు. గత పదేళ్లలో తాను ఎనిమిది గుండెమార్పిడి చికిత్సలు నిర్వహించానని వివరించారు. గుండెమార్పిడి చికిత్సకు దాదాపు రూ.15లక్షల వరకు ఖర్చు వుతుందని, గుండెమార్పిడి చికిత్సల్లో 80 శాతం విజయవంతం అవుతున్నాయన్నారు.

## ఇదీ జీవన్‌దాన్

ప్రమాదాల్లో బ్రెయిన్‌డెడ్ అయిన వారి నుంచి మూత్రపిండాలు(2), గుండె కవాటాలు(2), కళ్లు(2), గుండె, ఊపిరితిత్తులు, కాలేయం... మొత్తం తొమ్మిది అవయవాలు సేకరించి మార్పిడి చేయడానికి అవకాశం ఉంది. ఇందుకు వీలుగా ప్రభుత్వం 2012 జూన్‌లో 'జీవన్‌దాన్' పథకాన్ని ప్రవేశపెట్టి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యనిపుణుల కమిటీకి బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ అవయవమార్పిడి చికిత్సలు అవసరమైనవారు పేర్లు నమోదు చేసుకోవడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేశారు. బ్రెయిన్‌డెడ్ అయినవారి సమాచారం అందిన వెంటనే, సంబంధిత వ్యక్తి కుటుంబీకులను అవయవదానం గురించి వివరించి, వారిని ఒప్పించేందుకు జీవన్‌దాన్ కమిటీ సభ్యులు కృషి చేస్తారు. ఈ ఏడాది జనవరి నుంచి జీవన్‌దాన్ పథకం కింద 40 మంది దాతల నుంచి సేకరించిన అవయవాలను... 180 మందికి అమర్చి కొత్త జీవితాలను ఇవ్వగలిగామని నిమ్స్‌కు చెందిన అధికారిణి అనురాధ చెప్పారు. అవయవమార్పిడి చికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించిన రోగులు www.jeevandan.gov.in వెబ్‌సైట్‌లో కూడా పేర్లు నమోదు చేసుకోవచ్చని సూచించారు.